HAPPY DOCTORS DAY ADVT.SPL.

# ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ

**కుత్బుల్లాపూర్:** జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 23 ఫిర్యాదులు వచ్చాయి. గాజులరామారం ఉప కమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మొత్తం 13 ఫిర్యాదులు రాగా వాటిలో ఇంజినీరింగ్ 5, టౌన్ ప్లానింగ్ 8 ఫిర్యాదులు అలాగే కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నరసింహ అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో 10 ఫిర్యాదులు రాగా వాటిలో టౌన్ ప్లానింగ్ 4, ఇంజినీరింగ్ 3, ట్యాక్స్ సెక్షన్ 2, శానిటేషన్‌పై ఒక ఫిర్యాదు అందినట్లు పేర్కొన్నారు. ఆయా విభాగాల వారీగా వాటిని అధికారులకు అందజేశారు. అయితే వీటిలో అధికంగా అక్రమ నిర్మాణాలపైనే 12 ఫిర్యాదులు రావడం గమనార్హం.

### జలమండలి కార్యాలయంలో..

**చింతల్:** కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయంలో వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ మాధవి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 8 ఫిర్యాదులు వచ్చాయి. గాజులరామారం సెక్షన్ వీనస్ ఎన్‌క్లేవ్‌లో లో ప్రెషర్ తో నీటి సరఫరా అవుతోందని వీరచంద్ర ఫిర్యాదు చేశాడు. జీడిమెట్ల సెక్షన్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ నూతన పైప్‌లైన్ వేయాలని సుదర్శన్ రెడ్డి, సూరారం సెక్షన్ లక్ష్మీనగర్‌కాలనీలో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదంటూ కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. సూరారం సెక్షన్ శ్రీనివాస్‌నగర్‌లో భూగర్భ డ్రైనేజీ నూతన పైపులైన్ వేయాలని సీహెచ్ రవీందర్, భగత్‌సింగ్‌నగర్ సెక్షన్ చింతల్‌లో మురుగునీరు రోడ్లపై పారుతోందని, ఉషోదయ సెక్షన్ రోడ్ మేస్త్రీనగర్‌లో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ వేయాలని కోరుతూ కాలనీవాసులు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. డీజీఎంలు, మేనేజర్లు, ఎలక్ట్రికల్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు

## నియామకం

**సుభాష్‌నగర్:** తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సలహా కమిటీ సభ్యుడిగా ప్రముఖ తెలంగాణ ఉద్యమకారుడు, ఓయూ జేఏసీ చైర్మన్ కాంగ్రెస్ నాయకుడు దరువు అంజన్న నియామకమయ్యారు. ఈమేరకు భాషా సాంస్కృతిక, ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అంజన్నకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా దరువు అంజన్న మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులందరికీ అందేలా చూస్తానని అలాగే యువత సన్మార్గంలో నడిచేలా పలు కార్యక్రమాలు చేపడుతూ, సమాజ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.


దరువు అంజన్న




## తాగునీటి సమస్యను పరిష్కరించాలి


కాలనీవాసులతో ఎమ్మెల్యే వివేకానంద్

**కుత్బుల్లాపూర్:** తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆదేశించారు. సూరారం పరిధిలోని స్కందానగర్‌లో తాగునీటి ఎద్దడి సమస్యపై కాలనీ వాసులు బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన స్థానికులతో కలిసి ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే వాటర్ వర్క్స్ అధికారులు మాధవి, రాజేశ్‌తో ఫోన్లో మాట్లాడి తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

## మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి

**సుభాష్‌నగర్:** మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని బాలయ్యనగర్ ప్రెసిడెంట్ ఇడిగోటి నగేశ్ అన్నారు. గాజులరామారం డివిజన్ బాలయ్యనగర్‌లో పొదుపు సంఘాల విషయమై వారం రోజులుగా మహిళలతో ప్రత్యేక సమావేశమై పొదుపు సంఘాల వల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ బస్తీలో 30 గ్రూపులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఇప్పటికి 8 సంఘాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి

**కుత్బుల్లాపూర్:** మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు భైరి ప్రశాంత్‌గౌడ్ కొంపల్లి మున్సిపాలిటీ దేవరశెట్టి వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ సభ్యులతో కలిసి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో వీధి దీపాలు, డ్రైనేజీ, రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పరిష్కరించాలని కోరారు. మాజీ కౌన్సిలర్ శివకుమార్‌గౌడ్, దేవరశెట్టి అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్ కుమార్, రవి కుమార్ తదితరులు ఉన్నారు.

## ప్రథమ చికిత్స, మెడికల్ ఎమర్జెన్సీపై శిక్షణ

**జీడిమెట్ల:** జీడిమెట్ల ఠాణాలో ప్రథమచికిత్స, మెడికల్ ఎమర్జెన్సీ ట్రైనింగ్ కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా షాపూర్‌నగర్‌లోని రామ్‌రాజ్ ఆస్పత్రి వైద్యులు ఎమర్జెన్సీ సమయంలో పోలీసులు అందించాల్సిన ప్రథమ చికిత్స, సీపీఆర్ విధానాన్ని జీడిమెట్ల ఠాణా సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ మాట్లాడుతూ.. పోలీసులంటే అన్ని విధాలా రక్షించేవారిలా ప్రజల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో రామ్‌రాజ్ ఆస్పత్రి మేనేజ్‌మెంట్ శ్రీమతి ప్రవంతి, డాక్టర్ దుర్గాప్రసాద్, డీఐ కనకయ్య, ఎస్సైలు రాంచందర్, ప్రేమ్ కుమార్, నాయుడు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## అప్రోచ్ రోడ్డు నిర్మించి ట్రాఫిక్ రద్దీని తగ్గిస్తాం

**కుత్బుల్లాపూర్:** రామిరెడ్డినగర్, పాపయ్యయాదవ్ నగర్‌ను ఎమ్మెల్యే వివేకానంద్ ఆయా విభాగాల అధికారులతో కలిసి సోమవారం సందర్శించారు. ఆల్వాల్, సుచిత్ర, బ్యాంక్ కాలనీలకు చేరుకునేందుకు ఐడీపీఎల్ నుంచి రామిరెడ్డినగర్, పాపయ్యయాదవ్‌నగర్ మీదుగా వాహనాలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయని, దీంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన ఐడీపీఎల్ నుంచి దిల్‌కుష్‌నగర్ వరకు అప్రోచ్ రోడ్డు నిర్మాణంతో పాటు, నాలా బ్రిడ్జి పనులు, రామిరెడ్డినగర్‌లో నూతన కల్వర్టు నిర్మాణం, ప్రధాన రహదారిని 100 ఫీట్లకు విస్తరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డీఈ పాపమ్మ, ఏఈ అనురాగ్, మాజీ కార్పొరేటర్ కె.ఎం.గౌరీష్, స్థానిక సంక్షేమ ప్రతినిధులు ఉన్నారు.

## పౌర హక్కుల దినోత్సవం

**సుభాష్‌నగర్:** గాజులరామారం డివిజన్ ఉషోదయ కాలనీలో పౌర హక్కుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున రావు, జగద్గిరిగుట్ట సీఐ నర్సింహులు, ఎస్సీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ప్రమీల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అదేవిధంగా దళితులు స్థానికంగా ఎదుర్కొంటున్న శ్మశాన వాటిక స్థలం విషయాన్ని దళిత సంఘాల ఐక్యవేదిక చైర్మన్ జేమ్స్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం, దళిత నాయకులు ప్రేమ్ కుమార్, కాటం దేవయ్య పలువురు పాల్గొన్నారు.

**సాయినగర్ కాలనీలో..**

**నిజాంపేట్:** బాచుపల్లి గ్రామం సాయినగర్‌కాలనీ వార్డు నంబర్–12లో సోమవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, తహసీల్దార్ ఎల్.పూల్‌సింగ్, ఎస్ఐ వెంకట్ రాథోడ్, సాంఘిక సంక్షేమ అధికారి మాణిక్యం, హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఏఈ సౌమ్య, స్థానిక ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు కల్పించిన హక్కులను పౌరులు వినియోగించుకుని ప్రయోజనాలు పొందాలని వారు సూచించారు.

## మెరుగైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి

**కుత్బుల్లాపూర్:** విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. షాపూర్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గణేశ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమకూర్చిన పుస్తకాలు, ప్రింటర్‌ను సోమవారం ఆయన పంపిణీ చేశారు. మండల విద్యాధికారి జెమినీ కుమారి, కాంగ్రెస్ నాయకులు కూన రాఘవేందర్‌గౌడ్, బుచ్చిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు వసంత కుమారి, శ్రీహరి, యాదగిరి, శివ, కృష్ణ ప్రసాద్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

**వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ..**

**కుత్బుల్లాపూర్:** సోషల్ కార్యక్రమంలో భాగంగా వాసవీ క్లబ్ సుచిత్ర సర్కిల్ జోన్ అధ్యక్షుడు మాశెట్టి శివకుమార్ ఆధ్వర్యంలో పేట్‌బషీరాబాద్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ విద్యార్థులకు నోట్ బుక్కులు, స్టేషనరీ, పండ్లను సోమవారం పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ బీరెల్లి చంద్రశేఖర్, జిల్లా ఇన్‌చార్జిలు తోట భిక్షపతి, వాస శ్రీనివాసులు, ఆకుల ప్రభాకర్, వాసవీ క్లబ్ సుచిత్ర ప్రతినిధులు ఉప్పల నాగరాజు, కొమిరిశెట్టి నంబూద్రి, పల్లా నాగరాజు, రుద్రంగి యోగేశ్, కాసం నాగేశ్వర్ పాల్గొన్నారు.













